ఇంటికెళ్లగానే భార్యతో 'ఆత్రేయ ఇలా రాయడం బాధగా ఉంది' అని వాపోయారు. అప్పుడామె 'విశ్వనాథన్ పాన్ నములుతారుగా, స్క్రిప్ట్ తెప్పించుకు చూడండి' అన్నారు. స్క్రిప్ట్‌లో 'పదవ' అని చూసి, ఘంటసాల ఊపిరి పీల్చుకున్నారు.

8. ఎట్టాగో ఉన్నాది ఓలమ్మీ... (దసరాబుల్లోడు)

'దసరాబుల్లోడు'లోని 'అరెరెరెరె... ఎట్టాగో ఉన్నాది ఓలమ్మీ...' మంచి మాస్‌సాంగ్. ఈ పాటలో ఉన్న 'అరెరెరెరె...' అనే అక్షరాలు ఇన్‌స్ట్రుమెంట్ మీద వాయించడం కష్టం. అది ఘంటసాల అద్భుతంగా పలికించబట్టి మరింత పాపులర్ అయింది. ఈ పాటకు ఘంటసాల వాయిస్, ఏయన్నార్ స్టెప్స్ జనాలను ఆకట్టుకున్నాయి. ఇదే పాటను 'నేనున్నాను'లో నాగార్జున రీ-మిక్స్ చేసి వాడారు. అక్కడ తండ్రి నర్తిస్తే, ఇక్కడ తనయుడు అంతే జోష్‌గా నర్తించారు.

9. జోరుగా హుషారుగా షికారు పోదమా...(భార్యాభర్తలు)

ఘంటసాల పాడిన సరదా పాటల్లో 'భార్యాభర్తలు'లోని 'జోరుగా హుషారుగా షికారు పోదమా...' ఒకటి. నేటితరం కారులో వెళ్లేటప్పుడు సరదాగా ఈ పాట వినేవాళ్లు... పాడేవాళ్లు ఉన్నారు. ఈ పాట టైటిల్‌తో 'జోరుగా హుషారుగా' అనే సినిమా వచ్చింది. ఆ సినిమాలో ఈ పాటను మోడ్రన్ ఆర్కెస్ట్రాతో రీ-మిక్స్ చేసి ఉపయోగించారు.

10. కోలో కోలయన్న కోలో నాసామి (గుండమ్మ కథ)

ఎన్టీఆర్, ఏయన్నార్... వీరిద్దరిలో ఎవరికి పాడితే వారి గొంతులానే అనిపించడం ఘంటసాల వాయిస్ ప్రత్యేకత. 'గుండమ్మకథ'లో 'కోలోకోలయన్న కోలో నా సామి' పాటో ఇద్దరు పాడుతున్నట్టు అనిపించినా ఏ హీరోకు తగ్గట్లుగా ఆ హీరోకు ఘంటసాల గాత్రంలో వ్యత్యాసం స్పష్టంగా వినిపించింది. అలాగే 'భూకైలాస్'లో 'దేవ దేవ ధవళాచల మందిర..' పాటను అటు ఎన్టీఆర్‌కీ, ఇటు ఏయన్నార్‌కీ తగ్గట్టుగా పాడారు. 'శ్రీకృష్ణార్జునయుద్ధము'లో ఎన్టీఆర్, ఏయన్నార్‌ల మధ్య వాద సంవాద పద్యం ఉంటుంది. ఆ పద్యాన్ని ఘంటసాల అద్భుతంగా పాడారు. అలా ఇద్దరు వ్యక్తులకు ఒకేసారి సంవాద పద్యాలు పాడటం చక్కటి 'ఓకల్ ఫీట్' అని చెప్పాలి.

11. పెను చీకటాయె లోకం... (మాంగల్య బలం)

ఘంటసాల పాడిన పాటల్లో 'మాంగల్యబలం'లోని 'పెను చీకటాయె లోకం' ఆయన తనయుడు ఘంటసాల రత్నకుమార్‌కు ఓ మంచి అనుభూతి. అఫ్‌కోర్స్ తండ్రి పాడిన పాటలన్నీ కుమారుడికి అలాంటివే అనుకోండి. అయితే 'పెను చీకటాయె' స్పెషల్. ఒకసారి ఘంటసాల రత్నకుమార్ పెట్రోలు పోయించుకోవడానికి బంక్‌కి వెళ్లారు. ఎంతసేపటికీ అక్కడి కుర్రాడు పెట్రోలు కొట్టకపోవడంతో విషయమడిగారు. 'ఒక్క నిమిషం సార్! ఘంటసాల పాట వస్తోంది. అది అయిపోయాక కొడతా' అన్నాడట. అప్పుడు రత్నకుమార్ 'నేను ఘంటసాలగారి అబ్బాయిని' అంటే ఆ కుర్రాడు ఆశ్చర్యానందాలతో చూశాడుట. ఈ విషయాన్ని స్వయంగా రత్నకుమార్ చెప్పారు.

12. జగమే మాయ బ్రతుకే మాయ... (దేవదాసు)

మద్యం మత్తులో హీరో పాడే పాటలకు ప్రాణం పోయడం అంటే ఘంటసాల గాత్రానికే చెల్లుబాటైంది. 'దేవదాసు'లో 'జగమే మాయ బ్రతుకే మాయ' పాట అందుకో ఉదాహరణ. 'దేవదాసు' కథను శరత్‌చంద్ర రాయక ముందు తాగుబోతులకు ప్రత్యేకంగా పేరు గట్రా లేవు. ఆ సినిమా తర్వాత తాగుబోతులను 'దేవదాసు' అనడం మొదలైంది. 'జగమే మాయ' పాట మందు బాబులకే కాదు... పాడుకునేవాళ్లందరికీ ఒక మైకం. వేదాంతపరంగా కూడా ఈ పాట ఓ మైకమే.

13. మనసు గతి ఇంతే... (ప్రేమనగర్)

'ప్రేమనగర్' సినిమాలో తాగుడు మానేసిన తర్వాత పాడే 'మనసుగతి ఇంతే' అద్భుతంగా ఉంటుంది. మనసు పడే మథనానికి అద్భుత ఆవిష్కరణ ఈ పాట.

14. నిదురపోరా తమ్ముడా... (సంతానం)

'సంతానం' సినిమాలో అనిసెట్టి సుబ్బారావు రాసిన 'నిదురపోరా తమ్ముడా..' అనే పాట ఉంది. ఈ పాటను ఘంటసాల- లతా మంగేష్కర్ పాడారు. ముందు లత పాడారు. ఆ తర్వాత ఘంటసాల వాయిస్‌ని రికార్డ్ చేశారు. లత కన్నా ఘంటసాల హైపిచ్‌లో పాడారు. ఆ తర్వాత ఆయన భార్య 'పాట ఎలా వచ్చింది?' అని అడిగితే. "ఆ సంగతలా ఉంచితే... ఈ పాట కోసం సుసర్ల దక్షిణామూర్తి (సంగీత దర్శకుడు) సూట్ కుట్టించుకున్నారు. బొంబాయి నుంచి లతాగారు వస్తున్నారు కదా... అందుకే సూట్ తొడుక్కున్నారు. ఎప్పుడూ పంచెకట్టులో కనిపించే ఆయనను మొదటి సారి ఆ సూట్‌లో చూశా" అని చమత్కరించారు.

15. శేషశైలా వాస... శ్రీ వేంకటేశా...(శ్రీవేంకటేశ్వర మహాత్మ్యం)

ఘంటసాల గాత్రం కొన్ని పాటలకు శాశ్వతత్వాన్ని ఇచ్చింది. ఆయన పాడిన భక్తి పాటలు శ్రోతల్లో భక్తిపారవశ్యాన్ని నింపుతాయి. అణువణువునా భక్తి తత్వాన్ని నింపుకొని ఆయన పాడిన పాటల్లో 'శ్రీవేంకటేశ్వర మహాత్మ్యం' చిత్రంలోని 'శేషశైలా వాస.. శ్రీవేంకటేశా' ఒకటి. తిరుమలలోని శ్రీవేంకటేశ్వరుడి దేవస్థానంలో ఈ పాట మోగుతూనే ఉంటుంది. కలియుగం ఉన్నంతవరకూ ఈ పాట ఉండి తీరుతుందంటే అతిశయోక్తి కాదేమో!

16. చల్లని వెన్నెలలో చక్కని కన్నె సమీపములో (సంతానం)

'సంతానం' సినిమాలోని 'చల్లని వెన్నెలలో చక్కని కన్నె సమీపములో' మంచి రొమాంటిక్ సాంగ్. 'ప్రేమికుడు'లో ఎస్పీ బాలు- ప్రభుదేవా కాంబినేషన్‌లో వచ్చే సీన్లో ఎస్పీబీ ఈ పాటను ఆలపిస్తారు. అప్పటికే లబ్ద ప్రతిష్ఠులైన బాలు ఘంటసాలను గుర్తు చేసుకుని ఈ పాటను ఆ సినిమాలో ఆలపించడం చెప్పుకోదగ్గ విషయం.

17. మాణిక్య వీణామ్..(శ్యామలాదండకం) (మహాకవి కాళిదాసు)

'మహాకవి కాళిదాసు' చిత్రంలోని 'మాణిక్యవీణామ్' అని మొదలై 'చతుర్భుజే... చంద్ర కళావతంసే...' అని వచ్చే శ్యామలా దండకాన్ని ఘంటసాల పాడుతున్నప్పుడు స్వరకర్త పెండ్యాల నాగేశ్వరరావుకి విచిత్ర అనుభూతి కలిగింది. పాడుతున్నప్పుడు ఘంటసాల చుట్టూ ఓ కాంతిపుంజం ఉన్న భావన



తనకు కలిగిందని పెండ్యాల స్వయంగా పేర్కొన్నారు. దండకం పూర్తయ్యాక ఘంటసాల దగ్గరకు వెళ్లే సాహసం చేయలేకపోయానని ఆయన అనడం విశేషం. ఆ దండకంలో ఘంటసాల గాత్రం దైవత్వం ఉట్టిపడిందనడానికి ఇదొక నిదర్శనం.

18. ధారుణి రాజ్య సంపద మదంబున... (పాండవ వనవాసం)

ఘంటసాల పాడిన పద్యాలు... స్తోత్రాలు ఎవర్‌గ్రీన్ అనాలి. ఘంటసాలకు ముందు 'ఈలపాట' రఘురామయ్య, సూరిబాబు... వీళ్లందరూ పద్యాలు పాడిన పద్ధతి ఒక ఎత్తు. ఘంటసాలది మరో ఎత్తు. 'మహాభారతం'లోని పద్యాల్లో ఘంటసాల ద్వారా పాపులర్ అయిన పద్యాలలో 'పాండవ వనవాసం'లోని 'ధారుణి రాజ్య సంపద మదంబున..' 'కురువృద్ధుల్ గురువృద్ధ బాంధవులనేకుల్...' లాంటివి చాలా ఉన్నాయి.

'నర్తనశాల'లో తిక్కన పద్యాలు, 'కాళహస్తిమహాత్మ్యం'లో ధూర్జటి మహాకవి పద్యాలు ఘంటసాల గాత్రం ద్వారా సామాన్యజనాల్లో కూడా ప్రసిద్ధి పొందాయి. స్తోత్రాల్లో 'సీతారామకళ్యాణం'లో వాడిన 'రావణ భుజంగ...' స్తోత్రం ఒకటి. ఇది రావణకృతం. ఆ విషయం చాలమందికి తెలియదు. ఘంటసాల ఆలపించడంతో ఆ స్తోత్రం పాపులర్ అయింది.

19. రసికరాజ తగువారము కామా... (జయభేరి)

స్వరసహితంగా ఘంటసాలగారు పాడటం మొదలుపెట్టాక ఔత్సాహిక గాయకులు కూడా ఆ ప్రయత్నం చేసేవారు. 'జయభేరి' చిత్రంలోని 'రసిక రాజ తగువారము కామా' పాట వారికి లిట్మస్ టెస్ట్ లాంటిది.

20. శివశంకరీ... శివానందలహరి శివశంకరీ...(జగదేకవీరుని కథ)

'జగదేక వీరుని కథ'లోని 'శివశంకరి...' పాట కూడా అంతే. ఔత్సాహిక గాయనీ గాయకులు తమ ప్రతిభను పరీక్షించుకోవడానికి 'రసిక రాజ తగువారము కామా' 'శివశంకరి'... ఈ రెండు పాటలు పాడాల్సిందే. ఈ పాటల్ని అద్భుతంగా పాడినవాళ్లు ఏ పాటనైనా పాడగలుగుతారు. వర్ధమాన గాయకుడిగా మంచిపేరు తెచ్చుకున్న హేమచంద్ర ఈ రెండు పాటల ద్వారానే బాగా పాపులర్ అయ్యాడు. గాయని కల్పన కూడా ఈ పాట ద్వారా చాలా పేరు తెచ్చుకున్నారు. చెన్నైకి చెందిన చిన్నారి స్ఫూర్తి ఈ పాటపాడి, ప్రశంసలు పొందింది. అంటే వయసు తారతమ్యం లేకుండా అన్ని వయసులవారికీ ఘంటసాల పాటలు ఓ స్ఫూర్తి.

21. నేనొక పూల మొక్క కడ నిల్చి...(పుష్పవిలాపం కావ్యం)

కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రిగారు రచించిన 'కుంతీకుమారి', 'పుష్పవిలాపం'.. ఈ రెండు ప్రైవేట్ సాంగ్స్ ఘంటసాల గాత్రంతో సామాన్య జనంలోకి ఎంతగానో చొచ్చుకుపోయాయి. ఈ రెండూ హృదయానికి హత్తుకునేవే. ముఖ్యంగా 'పుష్పవిలాపం'లో 'ఎంత దయలేనివారు మీ ఆడవారు...' అంటూ ఘంటసాల పాడిన పద్ధతి ఆ తర్వాతి తరం కుర్రకారు ఆడవారిని ఆటపట్టించడానికి ఉపయోగించడం మొదలైంది.

ఇక 'కుంతీకుమారి'లోని, 'అది రమణీయ పుష్పవనము' అని రచయిత కరుణశ్రీ రాస్తే, పాడే సౌకర్యం కోసం 'అది ఒక రమణీయ పుష్పవనము' అని ఘంటసాల మార్చారు. దానివల్ల ఛందస్సు దెబ్బతిన్నదనే విషయాన్ని కూడా ఎవరూ గ్రహించలేదు. ఘంటసాల పాడే పద్ధతికి ఉన్న ప్రత్యేక అది అని ఓ

భగవద్గీత... ఓ రికార్డు!

వేదవ్యాసుడు 'మహాభారతం'లోని కురుక్షేత్ర సమయంలో అర్జునుడికి శ్రీకృష్ణపరమాత్మ బోధించిన 'భగవద్గీత' భక్తులకూ, వేదాంతులకూ పరమ పవిత్రమైనది. జీవన వేదాంతమంతా చెప్పే ఆ మహత్తర గీతా శ్లోకాలనూ, వాటి భావాన్నీ తెలుగునాట వాడ వాడలా పాపులర్ చేసింది ఘంటసాలే! ఆయనకన్నా ముందు గాయనీమణులు ఎమ్మెస్ సుబ్బలక్ష్మి, లతా మంగేష్కర్ లాంటి కొందరు భగవద్గీత పాడినా, అవి ఏవీ సాటిరావు. ఎంతోమంది ఆ తర్వాత ప్రయత్నించినా వేరేదేనికి ఆ స్థాయీ ప్రాచుర్యం రాలేదు. హెచ్.ఎం.వి. వారి గ్రామఫోన్ రికార్డుల ద్వారా ఘంటసాల చేసిన గాన యజ్ఞానికి మూలకారకుడు మంగపతి.

ఘంటసాల కుటుంబ సభ్యులు

సందర్భంలో గాయకుడు పీబీ శ్రీనివాస్ అన్నారు.

22. టాటా వీడుకోలు.. గుడ్‌బై ఇంక సెలవు... (బుద్ధి మంతుడు)

'టాటా వీడుకోలు...' తాగుబోతు పాట అని 'బుద్ధిమంతుడు' సినిమా చూసినవాళ్లకు తెలుస్తుంది. చూడనివాళ్లు ఇదేదో సరదా పాట అనుకుంటారు. 'వీడుకోలూ...' అంటూ ఘంటసాల ఒక రకమైన మత్తుతో పాడతారు. మత్తు పాటలకు ఘంటసాల ఇచ్చినంత పాపులారిటీ ఏ గాయకుడూ ఇవ్వలేదు. చెప్పుకోదగ్గ విషయం ఏవిటంటే... దేశంలో ఏ గాయకుడికీ లేనన్ని శిలా విగ్రహాలు ఆయనకే ఉన్నాయి. ఘంటసాల అకాడమీ ఉంది. ఆయన పాటలు సేకరించే వాళ్ళ సంఖ్య బోలెడు. ఘంటసాల మీద ఎన్నో పుస్తకాలు వచ్చాయి. అలా ఆయన, ఆయన పాటలచలేదు. ఘంటు ఎన్నటికీ చిరంజీవులే.



రచయిత, చిత్రకారుడు
అడవిబాపిరాజు

అతడు గీసిన గీత బొమ్మై
అతడు పలికిన పలుకు పాటై
అతడు చూపిన చూపు మెరుపై
అతడు తలచిన తలపు వెలుగై
అతని జీవికలోని తియ్యని
అమృతరసధునియై - అని ఆప్యాయంగా అన్నారు విశ్వనాథ సత్యనారాయణ.

అడవి బాపిరాజు విశ్వనాథ తరానికి సమకాలికులు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నిర్వహించిన పోటీలో, వేయి పడగలు నారాయణరావు నవలలు బహుమతికి ఎంపికైనాయి. ఆనాడు (1934) బహుమతి మొత్తం వేయి నూట పదహార్లు. దానిని ఇద్దరికీ సమంగా పంచారు. రెండు నవలలూ తెలుగు జీవితానికి అద్దంపట్టేవేనని న్యాయనిర్ణేతలు అభిప్రాయపడ్డారు.

మన్మథనామ సంవత్సరం అంటే 1895 అక్టోబర్ 8న భీమవరానికి సమీపంలోని సరిపల్లె గ్రామంలో అడవిబాపిరాజు జన్మించారు. విశ్వనాథ, జాషువా కూడా మన్మథలోనే పుట్టారు. రాజమండ్రిలో బి.ఏ. పట్టభద్రులైనారు. తర్వాత చెన్నపట్నంలో బి.యల్. పూర్తి చేసి భీమవరంలో న్యాయవాదిగా ప్రాక్టీస్ పెట్టారు. భారత సత్యాగ్రహోద్యమంలో జైలుకు వెళ్లారు. బందరు ఆంధ్ర జాతీయ కళాశాలలో ప్రమోద్‌కుమార్ ఛటోపాధ్యాయ వద్ద చిత్రలేఖనం నేర్చుకున్నారు. 1930లలో అనసూయ, మీరాబాయి, ధృవ చలనచిత్రాలకు కళా దర్శకత్వం వహించారు. 1934లో బందరు ఆంధ్ర జాతీయ కళాశాల ప్రధాన ఆచార్య పదవిని స్వీకరించారు. అప్పట్లో రాజమండ్రి ఆర్ట్స్ కళాశాలలో ఆస్వాల్ కూల్రే అనే తెల్ల దొర పనిచేస్తూ వుండేవారు. ఆయన గొప్ప కవి, చిత్రకారుడు, బుద్ధిశాలి. ఆయన అత్యంత ప్రీతిపాత్రుడు బాపిరాజు. వారి వద్ద ఎన్నో కళా మర్మాలను ఆకళింపు చేసుకున్నారు. సౌందర్య దృష్టి అలవడింది. బాపిరాజు సృష్టించుకున్న ఊహాసుందరి శశికళ. ఆమె కోసం ఒక స్వప్నలోకం సృష్టించి ఆమెకు పట్టం కట్టారు. ఆ దివ్యసుందరికి తన హృదయంలో పూజాపీఠం అమర్చి 'నా ఆత్మ మధ్యమ అమృతమూర్తివి నువ్వు నువ్వేనే..' అంటూ పాటలు పాడటం ఆరంభించాడు. ఆ రోజుల్లో ఒకరు ఊర్వశిని, మరొకరు శశికళను, ఇంకొకరు సుందరిని కలలు కంటూ కవిత్వాలు రాయడం ఒక నాగరికత. ఈ విషయాన్ని కాటూరు వెంకటేశ్వరరావు విశ్లేషిస్తూ 'ఇరవయ్యో శతాబ్ది ప్రథమ పాదంలో మన కాలేజీలలో చదువుకుండూ పడుచువాళ్లకు దేశ కాల పరిస్థితులు అనుకూలంగాలేవు. శేషమయిన ఆస్తులు కాలేజీ చదువులతో ఒట్టిపోయినవి. ఎక్కడో బడిపంతులుగానో, ఆఫీసు గుమస్తాగానో కాలక్షేపం చేయడానికి మనస్కరించదు. ప్రభుత్వం, సంఘం ఆచారాలు శిలా ప్రాకారాల వలె తోచి తమ అభీష్టాలకు అభిరుచులకు ఆస్కారం దొరికేది కాదు. అచలాయతమై కనిపించే సంఘం జీవనం కంటకమై తోచేది. ఇలా బాహ్యాభ్యంతరాలకు పొత్తు కుదరక, ఆ రెంటినీ సమన్వయించుకొనే పురుషాకారం చాల భావకులైన పడుచువాళ్లు నిరాశపరులై భావలోలురు కావల్సి వచ్చింది.

అడవి బాపిరాజు కావ్యాలు, కథలు, నవలలు విరివిగా వెలువరించారు.

ముష్టి లక్ష్మీనారాయణరావు నాటి విలక్షణమైన స్వాతంత్ర సమరయోధుడు. ఆయన జీవితాన్నే నారాయణరావు నవలగా మలిచారు. అడవి శాంతిశ్రీ నవలలో ఇక్ష్వాకు రాజవంశ చరిత్రను కనులకు కట్టించారు. ఇందులో నాయిక అడవి శాంతిశ్రీ. నాయకుడు బ్రహ్మదత్తుడు. యిది స్త్రీ పురుష సంబంధాలను విడమరచి చెప్పే నవల. బాపిరాజు మరో సాంఘిక నవల జాజిమల్లి. హిమబిందు, శాతవాహన చక్రవర్తుల కథ. గోన గన్నారెడ్డి, కాకతీయుల కాలం నాటిది. అన్ని రచనల్లోనూ బాపిరాజు స్వీయముద్ర కనిపిస్తుంది. ముందుతరం పాఠకులు బాపిరాజు నవలలను విపరీతంగా చదివారు. నవలాకారుడంటే అడవి బాపిరాజే అనుకునేవారు. 'జాజిమల్లి' నవలను దేశ పురోభివృద్ధికి పురుషులలో సమభాగం పంచుకుని ముందంజ వేస్తున్న స్త్రీకి కానుకగా సమర్పించారు. బాపిరాజు స్త్రీ జన పక్షపాతి. ఆయన రచనల్లో స్త్రీకి సముచిత స్థానం ఉంటుంది.

1944 ప్రాంతంలో హైదరాబాదు 'మీజాన్' తెలుగు పత్రికకు సంపాదకులుగా వచ్చారు. ఆ రోజుల్లో విద్వాన్ విశ్వం, తిరుమల రామచంద్ర, రాంభట్ల కృష్ణమూర్తి, బొమ్మకంటి సుబ్బారావు ఆయనకు సహాయకులుగా పనిచేశారు. మీజాన్ పత్రికలో ధూపదీపాలు, మిర్చి మసాలా, నర్తనశాల, కలంపోటు, టైంబాబు వంటి ఆయన కాలమ్స్ ఆసక్తికరంగా నడిచేవి. ఆనాటి హరిజనులను, వడ్డెర, ఉప్పర దైన్య జీవితాలను కథల్లో, నవలల్లో అడవి బాపిరాజు ప్రస్తావించారు. మీజాన్ పత్రికలో వారి సమస్యలను తరచూ వెలుగులోకి తెచ్చేవారు.

ఆయన సమకాలికులు 'బాపిబావ' అని ముద్దుగా పిలుచుకునేవారు.

ఆయన అజాత శత్రువు. ఆయన మూర్తి సుకుమారం. ఆయన హృదయం కుసుమ కోమలం. సాహిత్యంలో ఆయన స్పృశించని శాఖలేదు. నవలలు, కథలు, కావ్యాలు, వ్యాసాలు, రేడియో ప్రసంగాలు, నాటికలు, నాటకాలు– ఇలా అన్నింటినీ సంపన్నం చేశారు. 'బాపిరాజుకి అలవడని కళలేదు. కళలే ఆయనను వరించాయి' అన్నారు మేటి రచయిత ముద్దుకృష్ణ

అడవి బాపిరాజు వరదగోదావరిపై ఒక చక్కని గేయం రాశారు.

ఉప్పొంగి పోయింది గోదావరి! తాను
తెప్పున్న ఎగసింది గోదావరి!
కొండల్లో పులికింది
ఆకాశ గంగతో
హస్తాలు కలిపింది–

ఈ గేయాన్ని ఆరోజుల్లో బాలాంత్రపు రజనీకాంతరావు స్వరపరచి అద్భుతమైన సంగీతం కూర్చి ఆకాశవాణిలో ప్రసారం చేశారు. ఈ పాటకు జపాన్ దేశం అంతర్జాతీయ అవార్డుని ప్రదానం చేసింది. బాపిరాజుకి రెండెడ్ల బండి మిక్కిలి అభిమాన వస్తువు, కథల్లో ఇష్టమైన పాత్ర. ఆయన గంగిరెద్దు పాట ఇప్పటికీ ప్రచారంలో ఉంది. అడివి బాపిరాజు తెలుగు తల్లి ముద్దుబిడ్డ. 1952లో కన్నుమూశారు. ఇలాంటి తెలుగు బిడ్డలను కనీసం స్మరించుకోవడం తెలుగు సాహితికే గౌరవం.

శ్రీరమణకు కృతజ్ఞతలు

ఆయన గాంధేయవాది. కళాహృదయుడు. చిత్రలేఖనం, శిల్పం, సంగీతం, కవిత్వం అన్నిటా అధికారం సంపాదించారు. సమస్త శాస్త్రాలను అధ్యయనం చేశారు. అందులోని సారాన్ని వారి రచనల్లో రసాత్మకంగా పొందుపరిచారు. బాపిరాజు కళలోనే పుట్టారు. పెరిగారు. తన్మయమయ్యారు.

'కూచిపూడి నాట్యాన్ని చూసి ప్రపంచమే పులకించింది

పురాతనమైన కూచిపూడి నాట్యానికి సిలబస్ తయారు చేసి ప్రపంచవ్యాప్తి కావించిన గురువు వెంపటి చినసత్యం

'కూచిపూడి' నాట్యం పులకించింది. ఎందరినో మురిపించింది.... మరెందరినో మైమరపించింది. కృష్ణాజిల్లాలోని మారుమూల గ్రామం కూచిపూడి. కూచిపూడి నాట్యానికిది పుట్టినిల్లు. గోల్కొండ నవాబు అబ్దుల్ హసన్ తానీషా ఈ గ్రామాన్ని కూచిపూడి కళాకారులకు నజరానాగా ఇచ్చాడట.

కూచిపూడి నాట్యరీతికి ఆద్యుడు సిద్దేంద్రయోగి. ఆయన జ్ఞాపకార్థం, గౌరవార్థం మొట్టమొదటిసారిగా 1948లో సిద్దేంద్రయోగి ప్రథమ వార్షిక జయంతి ఉత్సవం పేరిట కూచిపూడి నృత్యాన్ని నిర్వహించారు. ఎందరో ప్రముఖ కళాకారులు అప్పటి వేడుకలలో పాలుపంచుకున్నారు.

ఎంతో ఘనచరిత్ర గలిగిన ఈ కూచిపూడి నాట్యరీతిని దశదిశలా మరింతగా చాటి చెప్పాలని, కూచిపూడి గ్రామానికి ప్రపంచ వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టాలన్న లక్ష్యంతో 2009 మార్చి 6వ తేదీ నుంచి 12వ తేదీ వరకు కూచిపూడి గ్రామంలో సిద్దేంద్రయోగి మహోత్సవాలు, కనులపండువుగా జరిపించిన నాట్య యోగులు వెంపటి చినసత్యం.

కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ (చెన్నై)కి చెందిన వెంకట్ వెంపటి, కూచిపూడిలోని అఖిల భారత కూచిపూడి నాట్యకళా మండలికి చెందిన పసుమర్తి కేశవ ప్రసాద్‌ల ఆధ్వర్యంలో ఈ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవ కమిటీకి చైర్‌పర్సన్‌గా ఉన్న పద్మభూషణ్ డాక్టర్ వెంపటి చిన సత్యం అధ్యక్షత వహించారు.

జాతీయస్థాయిలో జరిగిన ఉత్సవాల్లో పేరెన్నికగన్న పలువురు నృత్యకళాకారులు తమ నాట్య కౌశలంతో రసజ్ఞులను అలరించారు.

మార్చి 6న జరిగిన ప్రారంభోత్సవంలో భాగంగా కూచిపూడి, యక్షగాన పితామహుడు శ్రీచింతా వెంకట రామయ్య 150వ జయంతిని పురస్కరించుకొని పద్మభూషణ్ కళామండలం శ్రీరామన్ కుట్టి నాయర్‌ను 50 వేల రూపాయల నగదు బహుమతితో వెంపటి సత్కరించారు.

అదే రోజు పద్మభూషణ్ శ్రీమతి పద్మా సుబ్రమణియం భరతనాట్య నృత్య ప్రదర్శన మొత్తం కార్యక్రమానికే శోభ చేకూర్చింది. రెండవ రోజు నుంచి ప్రతిరోజూ ఉదయం 8 గంటలకు గురువర్యులు వెంపటి రవిశంకర్ ఆధ్వర్యంలో కూచిపూడి నృత్యరీతులలో గల మెళకువలను గురించి విద్యార్థినీ, విద్యార్థులకు శిక్షణా తరగతులు నిర్వహించారు.

అలాగే ప్రతిరోజూ ఉదయం 10.30 గంటలకు అష్టవిధ నాయకుల హావభావాల మేళవింపును శ్రీమతి శిమోయి వెంకట్ (కూచిపూడి), శ్రీమతి లీనా మొహంతి (ఒడిస్సి), కుమారి ఎలీనా లక్ష్మి (కూచిపూడి) నృత్యరూప ప్రదర్శన ప్రేక్షకులను ఎంతో ఆకట్టుకుంది.

కార్యక్రమంలో భాగంగా పద్మభూషణ్ కళామండలం రామన్‌కుట్టి నాయర్ బృందం ప్రదర్శించిన కథక్కళి నృత్యరూపకం, శ్రీమతి అన్నాబత్తుల లక్ష్మీ మంగతాయారు కోనసీమ సాంప్రదాయంలో ప్రదర్శించిన 'గొల్లకలాపం' వేదాంతం వెంకు, కూచిపూడి భాగవత మేళం సమర్పించిన 'భామాకలాపం' ప్రదర్శన ఆద్యంతం కళా హృదయులను అలరింపజేశాయి.

శ్రీహరి- శ్రీమతి చేతన్ చేసిన కథక్ నృత్యం, శ్రీవెంపటి రవిశంకర్ ఇచ్చిన కూచిపూడి నృత్యప్రదర్శన, పసుమర్తి రత్తయ్య బృందం ప్రదర్శించిన ఉషా పరిణయం, కూచిపూడి యక్షగానం ప్రేక్షకులను మంత్రముగ్దులను చేశాయి.

శ్రీమతి కళామండలం శైలజ నంబియార్ కుట్టు (కుటియాటం) నృత్యం, శ్రీమతి జొన్నలగడ్డ అనూరాధ బృందం ప్రదర్శించిన 'చండాలిక' కూచిపూడి నృత్యరూపకం, డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి బృందం ప్రదర్శించిన 'వినాయక చవితి' కూచిపూడి నృత్యరూపకం ఈ నృత్యమహోత్సవానికి తలమానికంగా నిలిచాయి.

శ్రీమతి యామినిరెడ్డి (కూచిపూడి) నృత్యం, శ్రీ వేదాంతం రాధేశ్యామ్ బృందం ప్రదర్శించిన కూచిపూడి యక్షగానం పండిత పామరరంజకమైంది.

శ్రీమతి లీనా మొహంతి (ఒడిస్సి) నృత్యం, శ్రీ ఇమోచాసింగ్ బృందం (మణిపురి) నృత్యం, శ్రీ పసుమర్తి వెంకటేశ్వర శర్మ బృందం ప్రదర్శించిన 'మహిషాసుర మర్దినీ' కూచిపూడి నృత్యరూపకం ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఉత్సవాలలో చివరి రోజున శ్రీమతి శీలా ఉన్నికృష్ణన్ బృందం ప్రదర్శించిన 'పార్వతి పరిణయం' భరతనాట్య నృత్యరూపకం, డాక్టర్ వెంపటి చిన సత్యం బృందం ప్రదర్శించిన 'క్షీరసాగరమథనం' కూచిపూడి నృత్య రూపకం నృత్యోత్సవాలకు కలికితురాయిగా నిలిచాయి.

కూచిపూడి యక్షగానానికి ఆద్యుడైన శ్రీసిద్దేంద్ర యోగి నడయాడిన కూచిపూడి గ్రామం అక్కడికి సమీపంలో గల 'మొవ్వ' క్షేత్రాలను భారతీయ పర్యాటక కేంద్రాలుగా గుర్తించడానికి అవసరమైన వసతులు కల్పించి, దైవదత్తమైన ఈ కళారూపాలను భావితరాల వారికి అందించవలసిన అవసరం ఎంతో వుంది.

–డాక్టర్ కె. సూర్యారావుకు కృతజ్ఞతలు



అభినయం



ముగ్గురు పద్మభూషణ్‌లు ఏలూరులో వెంపటి చినసత్యం, పద్మా సుబ్రమణియం, రామన్ కుట్టి నాయర్ పాల్గొన్నారు.



సిద్ధేంద్రయోగి వద్ద జ్యోతి ప్రజ్వలనతో ఉత్సవాలు ప్రారంభం



అభినయం

జి.వి. రావ్ పేజీ

ప్రాచీన విద్యా విధానానికి, వర్తమాన విద్యా విధానానికి చాలా వ్యత్యాసం వుంది. పరమ పవిత్రమైన విద్యను విక్రయింపకూడదు. మూల్యం స్వీకరించకుండా విద్యాదానం చేయాలి.

\- స్వామి వివేకానంద

(గోటేటి వేంకటేశ్వరరావు)

ప్రతీ సంవత్సరం జనవరి 12న యువకుల దినోత్సవం జరుపుకుంటుంటాం. ఆ రకంగానైనా వివేకానందుని తలుచుకుంటారనేమో. భారతదేశ ఖ్యాతిని దశదిశలా వ్యాపింపజేసిన మహోన్నతుడు. హిందూ మత విశిష్టతను విశ్వవ్యాప్తం చేసి కీర్తిప్రతిష్ఠలు సాధింపజేసిన ఘనుడు. అందరూ విద్యావంతులుగా వుండాలని అభిలషించారాయన. అందుకేనేమో దేశమంతటా వున్న రామకృష్ణ మిషన్ ఆశ్రమాలు, శారదా మిషన్ ఆశ్రమాలు, వివేకానంద విద్యాలయాలలో పాఠశాలలని ఏర్పరచి అందరికి అందుబాటులో వుండేవిధంగా ఫీజులలో విద్యనందిస్తున్నారు. యువకులను విద్యావంతులను చేయడం, వారి వ్యక్తిత్వాలను వికసింపజేయడం చేస్తే మిగిలినదంతా వారే సాధించుకుంటారు. కాని ప్రస్తుత విద్యావిధానం ఇలా వుందా? స్కూలులో చేర్చేటప్పుడు లక్షల డొనేషన్లు ఫలానా స్కూల్‌లో చదివి, వారు పెద్ద పెద్ద ఉద్యోగాలు చేస్తూ, గొప్పగా బ్రతుకుతూ ఎక్కువ సంపాదన గడిస్తారని ఆలోచనలోకి మనం వచ్చేసాం. పిల్లలు ఆటలు మరచిపోయారు. ప్రాథమిక విద్యనభ్యసించే విద్యార్థి అప్పటినుంచీ ట్యూషన్లు, కోచింగ్ సెంటర్లు వెంటపడడం, ప్రతి యువకుడు, యువతికి వారే మొదటి తరగతిలో ఉత్తీర్ణులవ్వాలని వారికి నూరిపోస్తూ వారిని మానసిక సంఘర్షణకు గురిచేస్తున్నాము. పోటీతత్వాన్ని నూరిపోస్తున్నాం. దీనివల్ల మిత్రత్వం తగ్గి శతృత్వం పెరుగుతోంది. మనుషులు మానవతను మర్చిపోయి యాంత్రికంగా తయారయ్యారు. కొంతమంది మృగాలుగాను అయిపోతున్నారు. ఇటీవల డిసెంబరు 31 రాత్రి బెంగుళూరులో యువతులపై జరిగిన అత్యాచారం మీకు ఉదాహరణ. అర్థరాత్రి 12 గంటలకు తాగి తందనాలాడడం మన సంస్కృతి కాదు, ఏ జాతి సాంప్రదాయము కాదు. చేతినిండా పుష్కలంగా డబ్బున్నప్పుడు ఏమి చెయ్యాలో తెలియక తప్పతాగి, ఆ మైకంలో విచక్షణ మరచిపోయి, మృగాలయ్యి వీధికుక్కలు చేసే పని మనము చేస్తూంటే ఇక వాటికి, మనకు తేడా ఏమిటి. విలువలులేని విద్య అదే డబ్బిచ్చి కొనుక్కున్న విలువైన విద్య, మనకు నేర్పిన మానవత్వం ఇదేనా?

మనం ఎంత సంపాదించినా, ఒక వస్తువు కావాలన్నా, ఒక విహారయాత్రకు వెళ్ళాలన్నా ఇంట్లోవున్న పెద్దలను సంప్రదించి వారికి ఎరుక పరిచి డబ్బు ఖర్చు పెట్టే సంస్కృతి నుంచి వచ్చినవారం మనం. రేపటి కోసం కష్టించి సంపాదించిన సొమ్ములో కాస్త ఆదా చేసే అలవాటు వున్నవారం. అటువంటి మనం ఇలా ఎలా మారిపోయాం. ఎప్పుడైతే ఉమ్మడి కుటుంబ వ్యవస్థ పోయిందో అప్పుడే కొన్ని విలువలను వదిలేసాం. అది ఇప్పుడు విశ్వరూపమై మన కంటి ముందు కనిపిస్తూంటే ఏమి చేయాలో తెలియని చిత్ర విచిత్ర పరిస్థితుల్లో వున్నాం. పద్మవ్యూహంలో ఇరుక్కుపోయాం. మళ్ళీ ఓ వివేకానందుడు రావాలి, ఏదైనా చెయ్యాలి. మన పూర్వపు రోజులకు వెళ్ళాలి. నేను ఆశాజీవిని. ఇవన్నీ జరుగుతాయని ఆశిస్తున్నాను. జరగాలని ఆకాంక్షిస్తున్నాను. విలువలతో కూడిన విద్య, ఇదే మనం వివేకానందునికిచ్చే ఘనమైన నివాళి.

వేస్ట్

అంతంత పెద్ద విగ్రహాలెందుకు వేస్ట్

శివాజి ఖర్చు చేసే బదులు దానిని ఏదైన మంచి కార్యానికి ఉప్పయోగించవచ్చు కదా.

రామానుజ శిలా విగ్రహం పెట్టినందువల్ల కడుపు నిండుతుందా? ఆ డబ్బు ఏదైనా మంచి కార్యానికి వినియోగించవచ్చుగా.

పాపం చాలా మందికి నిజమే అనిపిస్తుంది

కాని మీకు చాలా వేస్టులు చెపుతా నాకు గుర్తుకొచ్చినవి.

రాజకీయంగా

ఊరంత కొన్ని వందలకోట్లు ఖర్చు పెట్టి నాయకులకు శిలలు, నాయకులకు సరిపోనట్టు ఏనుగులకు “పార్టీ గుర్తట” శిలలు,

స్మారక మందిరాలకు వందల కోట్లు – ఇవన్నీ వేస్ట్ కాదు’

పోని వ్యక్తిగతంగా

పుట్టినరోజు పండగలకు లారీలలో బస్సులలో జనం, గజ మాలలు. ఇవి వేస్ట్ కాదు.

మన ఇంటి వేడుకకు మా డబ్బు మా ఇష్టం ఎంతన్నా తగలేస్తాం, అంటూ చేసే వేస్టులకు అంతే లేదు.

శివాజిమహరాజ్ ఒక హిందూ రాజు, వీరుడు, ధీరుడు, శూరుడు అని ఎంతమందికి తెలుసు, చరిత్ర పుస్తకాల్లోనుండి ఆ చరిత్ర తీసేసాం, కనీసం అలా విగ్రహం పెడితే ఆయనెవరో తెలుసుకుంటారు, రేపక్కడికి వెళ్ళినపుడు ఆయనెవరని అడుగుతారు అప్పుడు ఆయన గొప్పతనం మనం ముచ్చటించుకుంటాం, అది మనకు గౌరవం.

అలాగే ఆధ్యాత్మిక గురువు రామానుజులు వారి జీవితం, వారి బోధనలు మనకు తెలియాలి.ఆయన ఆధ్యాత్మిక కృషి తెలియాలి

విహారయాత్రగా వచ్చిన వారు ఆ విగ్రహాలను చూసి, తరవాత తరాలకు తెలియజెప్పనియ్యండి, తెలుసుకోనియ్యండి.

లేదా వేస్టంటారా, ఏ వేస్టు చెయ్యకండి.

మీకు మీరు చేసే వేస్ట్ తెలియకపోతే తెలియ చెప్పడానికి మేమున్నాంగా. ●

అఆ
అతులిత పుష్ప పల్లవ ఫలాన్విత
భూరుహ భూరివల్లరీ
- మన మాతృభాష ఔన్నత్యం అభివ్యక్తీకరించడం,
ప్రతి ఉషస్సున లేవగానే
పాఠకులపై భారం వేయరాదని,
ఆరాధించడమనే తపనం, తపస్సు!
అర్థ, వృద్ధ భారాన్ని మోస్తూనే
265 నెలలుగా
265 సంచికలను
శ్రీ వేంకటేశ చరణౌ చరణం ప్రపద్యే।
ప్రముఖాంధ్ర
- వెలువరించ కలిగిదందంటే ఏడుకొండల ఱేడు కృప! వాగ్దేవి యిచ్చిన శక్తి!
'ప్రముఖాంధ్ర' వెబ్ ఎడిషన్ చూచినవారు
పాత పత్రికలను చూచినవారూ 'ప్రముఖాంధ్ర' కోరుతున్నారు.
కోరినవారందరికీ పంపాలనే ఉన్నది.
ధనసంపత్తి కలవారూ, మన సంపత్తి కలవారూ
ప్రముఖాంధ్ర నిధికి యధోచితంగా సహకరించండి.
రు.10000లు మించి పంపించిన ప్రదాతల పేర్లను
వారి ఫోటోలతో ప్రచురిస్తాం.
(ఉడతా భక్తిగా చిన్న విరాళములనూ పంపవచ్చు)
గోటేటి శ్రీరామారావు
స్థాపక సంపాదకుడు
చిరునామా:
16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 600 033.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com

గోపురం
పసుపుపొడి
&
కుంకుమ
TRADE MARK
GOPURAM
KUMKUM
Y.V.S.& CO., MADRAS.
Turmeric POWDER
GOPURAM
SINCE 1945
Shop online @ www.gopuramproducts.com
TRADITIONAL PRODUCT
FOR
POOJAS - FESTIVALS - OCCASSIONS